క్లుప్తంగా

సీఐ మల్లేష్‌కు సన్మానం



శాయంపేట : పరకాల రూరల్ సీఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన మల్లేష్‌ను పత్తిపాక సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పూల మొక్క బహూకరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, బాధితులకు న్యాయం చేయడంలో చొరవ చూపాలని సీఐని సర్పంచ్ రాజిరెడ్డి కోరారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిరెడ్డి జైపాల్‌రెడ్డి, చల్ల రాజిరెడ్డి, గజ్జి ఐలయ్య, జైపాల్‌రెడ్డి, మొగిలి పాల్గొన్నారు.

కొనసాగుతున్న కటాక్షపూర్ చెరువు మత్తడి



ఆత్మకూరు : ఇటీవల కురిసిన భారీ వర్షాల ఉధృతితో మండలంలోని కటాక్షపూర్ చెరువు మత్తడి జాతీయ రహదారిపై ఆదివారం కూడా కొనసాగింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. వాహనదారులు మత్తడి దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సీఐ రవిరాజు కోరారు.

పరామర్శ



పరకాల : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొచ్చు చందర్‌ను అతడి తండ్రి అంకూస్ కొద్ది రోజుల క్రితం మృతి చెందిన నేపథ్యంలో ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామిరెడ్డి ఆదివారం పరామర్శించారు. అనంతరం ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించి మాట్లాడారు. నాయకులకు, కార్యకర్తలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. తొలుత అంకూస్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ కోఆర్డినేటర్ బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, నాయకుడు కొండేటి కొమురారెడ్డి, పట్టణ కమిటీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ పోరండ్ల వేణు, ప్రధాన కార్యదర్శి పబ్బ శ్రీనివాస్, చందుపట్ల రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు సూర సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

హన్మకొండ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు హనుమకొండ జిల్లాలోని రెడ్డికాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయం, వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తామని తెలిపారు.

విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

మడికొండ: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మడికొండ ఇన్‌స్పెక్టర్ వేణు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపైనే దృష్టి పెట్టాలని సూచించారు. సెల్‌ఫోన్ ఎక్కువగా వాడకూడదని అన్నారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని చెప్పారు. సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై దివ్య, టీచర్లు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

కాజీపేట రూరల్: బాలల అక్రమ రవాణాను అరికట్టాలని ఆర్పీఎఫ్ సీఐ ఎం.సంజీవరావు కాంక్షించారు. అగైనెస్ట్ హ్యూమన్ ట్రాఫికింగ్ అవేర్‌నెస్ వరల్డ్ డేను పురస్కరించుకొని ఆర్పీఎఫ్, జీఆర్పీ, చైల్డ్‌లైన్-1098, ఎన్జీఓ ఆధ్వర్యంలో కాజీపేట జంక్షన్‌లో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో సంజీవరావు మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టాలని కోరారు. అనంతరం కాజీపేట జంక్షన్‌కు చేరుకున్న ధానాపూర్, గోల్కొండ, ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని ప్రయాణికులకు అవగాహన కల్పించారు. సదస్సులో ఆర్పీఎఫ్ ఏఎస్సై జావిద్, సుమలత, శ్రీలత, కృష్ణమూర్తి, ప్రవీణ్, శ్రుతి, రవి, చైల్డ్‌లైన్, సీడబ్ల్యూసీ ప్రతినిధులు అనిల్‌చందర్, సంతోష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ పాములు

● చిత్తడి నేలల్లో విషపురుగుల సంచారం

ఎల్కతుర్తి : వేణు పొలం పనులు చేసేందుకు ఉదయాన్నే పొలం గట్లపై నుంచి వెళ్తున్నాడు. అలా నడుస్తుండగా కాలుకు ఏదో గుచ్చినట్టు అనిపించి అబ్బా అనుకుని కాలును చూసుకున్నాడు. అంతే పాదంపై ఏదో కుట్టినట్టు అనిపించింది. అటుగా చూసే సరికి పొడవైన పాము పొలంలో నుంచి వెళ్తోంది. తనను పాము కాటేసిందని తెలుసుకునేలోపే విషం శరీరంలోకి ప్రవేశించింది. భయంతో వేణు కేకలు వేశాడు. చుట్టుపక్కల రైతులు వచ్చే సరికి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. నోటి వెంట వచ్చిన నురుగును చూసి దగ్గర్లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ ఆ సమయంలో ఆస్పత్రిలో పాము విషం విరుగుడు మందు లేదు. దీంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఇలాంటి ఘటనలు అనేకం..

వర్షాకాలం మొదలై జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలతో ఎక్కడ చూసినా నీటి గుంతలు, చిత్తడి నేలలే కనిపిస్తున్నాయి. వాతావరణం చల్లబడడంగా ఇంతకాలం భూమి బొరిగల్లో తలదాచుకున్న ఎలుకలు, కప్పలు, కీటకాలు బయటకు వస్తున్నాయి. వాటి కోసం పాములు తిరుగుతున్నాయి. సర్పాలతో కీటకాలే కాకుండా మనుషులకు, ముఖ్యంగా రైతులకు ప్రమాదం ఉందన్నది జగమెరిగిన సత్యం. విషసర్పాల కాటుకు గురైతే క్షణాల్లో ప్రాణాలు హరీమనడం ఖాయం. విషసర్పాల కాటుతో ప్రాణాలకు ప్రమాదం తప్పదు. నాగుపాము, తాచుపాము, కట్లపాము, రక్తపింజర లాంటి పాములు పలు ప్రాంతాల్లో కనిపించడం పరిపాటి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పంటచేల గట్లపై నడిచే సమయంలో కర్రతో చప్పుడు చేసుకుంటూ వెళ్లాలి. కిర్రు చెప్పులు, కర్ర చప్పుడుతో, వాటి ధ్వని తరంగాలతో పాములు పారిపోతాయి. తద్వారా పాము కాటు నుంచి తప్పించుకోవచ్చు.

రాత్రిపూట పొలం పనులకు వెళ్లే రైతులు తప్పనిసరిగా టార్చ్‌లైట్ తీసుకెళ్లాలి.

విషసర్పం కాటు లక్షణాలు

కాటేసిన చోట పాము కోరల గాయం స్పష్టంగా కనిపిస్తూ నొప్పి తీవ్రంగా ఉంటుంది. నొప్పి క్రమంగా పైపైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.

పాము కాటుకు గురైన వ్యక్తి కళ్లు మగతగా ఉండి స్పృహ కోల్పోతాడు.

పాక్షిక పక్షవాతం కారణంగా కొన్ని సార్లు నాలుక మందమైనట్లు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లు అనిపిస్తుంది.

వివిధ రకాల చికిత్స

పాముకాటుకు విరుగుడు కోసం యాంటీ స్నేక్ వీనం అనే మందును ఆస్పత్రుల్లో ఉపయోగిస్తారు.



నాగు పాము (ఫైల్)

మందు అందుబాటులో ఉంది



పాముకాటుకు సంబంధించి యాంటీ స్నేక్ వీనం మందు ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంది. పాముకాటుకు గురైన వ్యక్తులను సకాలంలో పీహెచ్‌సీలకు తీసుకొస్తే ఇంజక్షన్ వేస్తారు. తదనంతరం చికిత్స కోసం సివిల్, ఏరియా ఆస్పత్రులకు పంపిస్తే ప్రాణహాని నివారించొచ్చు.

హిక్తేదార్ హైమ్మద్, వైద్యాధికారి, ఎల్కతుర్తి

ఇది సకాలంలో అందితే ప్రాణాలు కాపాడొచ్చు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ మందు అందుబాటులో ఉంటుంది.

సమాజంలో పోలీసుల పాత్ర కీలకం



ఎస్సై చరణ్‌ను సన్మానిస్తున్న సీఐ, సిబ్బంది

కమలాపూర్ : సమాజంలో పోలీసుల పాత్ర కీలకమని సీఐ సంజీవ్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో పని చేసి బదిలీ అయిన ఎస్సైలు వెలిశెట్టి చరణ్‌కుమార్, మోటం సతీష్‌లను స్టేషన్ ఆవరణలో ఆదివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సీఐ సంజీవ్ మాట్లాడారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అండగా నిలిచేది పోలీసులు మాత్రమేనని చెప్పారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేమన్నారు. పోలీసులున్నారన్న ధైర్యంతోనే ప్రజలు ప్రశాంతంగా జీవిస్తారని తెలిపారు. విధి నిర్వహణలో నిబద్ధత కీలకమని చెప్పారు. సమర్థవంతంగా పని చేసి ప్రజల మన్ననలు పొందితే అంతకు మించిన గౌరవం మరొకటి లేదని స్పష్టం చేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు మాట్లాడారు. ఎస్సైలుగా చరణ్‌కుమార్, సతీష్ అందించిన సేవలను కొనియాడారు. అనంతరం స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్సైలు కరుణాకర్, సీమా ఫర్వీన్‌లకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచులు కట్కూరి విజయ తిరుపతిరెడ్డి, అంకటి సాంబయ్య, గుండపు చరణ్ పటేల్, ఎంపీటీసీలు ఎర్రబెల్లి సంపత్‌రావు, మాట్ల వెంకటేశ్వర్లు, నాయకులు కట్కూరి అశోక్‌రెడ్డి, తూర్పాటి క్రాంతి, పుల్ల శోభన్ బాబు, యాకం శ్రీనివాస్, పాడేటి భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మెరుగైన పాలన

● హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి స్పష్టం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలిచి అధికారంలోకి వస్తే రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ అందజేయడంతోపాటు మేనిఫెస్టోలో పొందుపర్చిన అన్ని అంశాలనూ అమలు చేయనున్నట్టు ఆయన తెలిపారు. 'పల్లెపల్లెకు ప్రవీణన్న.. గడపగడపకు కాంగ్రెస్' నినాదంతో భీమదేవరపల్లి మండలంలోని చంటయ్యపల్లి గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడచినా గత ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నామమాత్రంగా పథకాలను అమలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. దళితులకు భూపంపిణీ,, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నేటి వరకు అర్హులకు అందలేదని గుర్తు చేశారు. దళితబంధు పథకాన్ని రాష్ట్రంలోని హుజురాబాద్ నియోజకవర్గంలో మాత్రమే కొంత మేరకే అమలు చేశారని తెలిపారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, తదితర అనేక హామీలతో ప్రజల ఓట్లు దండుకుని గద్దెనెక్కి మోసపూరిత పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే గతంలో ప్రజలకు మెరుగైన పాలన అందిందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, తదితర అనేక కార్యక్రమాలు చేపట్టి పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చినట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పలువురి చేరిక

భీమదేవరపల్లి మండలంలోని రత్నగిరి గ్రామానికి చెందిన పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కేతిరి లక్ష్మారెడ్డి, ఐలయ్య, చిదురాల స్వరూప, కట్కూరి మహేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కనుకయ్య, సుభాష్‌రెడ్డి, రవి, సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు పరిహారం అందించాలి



పంటను పరిశీలిస్తున్న ఓదెలు, నాయకులు

కమలాపూర్ : భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఓదెలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారీ వర్షాలకు మండలంలో దెబ్బతిన్న పంటలను బీకేఎంయూ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలోని బృందం ఆదివారం సందర్శించి నష్టాన్ని పరిశీలించింది. అనంతరం ఓదెలు మీడియాతో మాట్లాడారు. రైతును రాజులా చేయడమే ధ్యేయమంటూ ఊదరగొడుతున్న సీఎం కేసీఆర్ భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఇప్పటివరకు పట్టించుకున్న దాఖలాల్లేవని విమర్శించారు. మండలంలో వేలాది ఎకరాల పంటల నష్టం వాటిల్లి రైతులు తీవ్ర వేదనకు గురౌతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. బాధిత రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే అధికారులతో సర్వే చేయించి బాధిత రైతులందరికీ ఎకరాకు రూ.25 వేలు చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి ఐక్యపోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లె మహేందర్, రైతు సంఘం మండల అధ్యక్షుడు ఈసంపెల్లి శంకర్, గీత పనివారల సంఘం మండల అధ్యక్షుడు జేరిపోతుల లచ్చన్న, బాలరాజు, బీకేఎంయూ మండల అధ్యక్షురాలు జేరిపోతుల శిరీష, ఉపాధ్యక్షుడు నవాబ్ పాల్గొన్నారు.

పెద్దచెరువును పరిశీలించిన అధికారులు



దామెర : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ఊరుగొండ పెద్దచెరువు కోతకు గురి కాగా ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) సునీత, డీఈ ఖాదిర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. సుమారు 5–6 ఫీట్ల మేరకు చెరువుకట్ట కోతకు గురైందని తెలిపారు. త్వరలో మరమత్తులు చేపడతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, ఊరుగొండ సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, దమ్మన్నపేట్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పుల్యాల రఘుపతిరెడ్డి, కునాటి సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడి చెరువు మత్తడికి మరమ్మతులు



చెరువు మత్తడికి మరమ్మతు చేస్తున్న జేసీబీ

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాకలోని గుడి చెరువు మత్తడికి సర్పంచ్ అబ్బు ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మరమ్మతు పనులు చేయించారు. 'సాక్షి'లో ప్రచురితమైన 'గుడి చెరువు కట్టకు గండి' కథనానికి నీటి పారుదల శాఖ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా డీఈ గిరిధర్, ఏఈ అమృత్ చెరువు కట్టను ఆదివారం సందర్శించి పరిశీలించారు. చెరువు కట్టకు నష్టం వాటిల్లకుండా మత్తడి వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, ముళ్ల కంపలను తొలగించి మత్తడిని లోతును చేయాలని సర్పంచ్ ప్రకాష్‌రెడ్డికి సూచించగా జేసీబీతో మరమ్మతు పనులు చేయించారు. అనంతరం మత్తడి నుంచి నీటిని విడుదల చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే కోతకు గురైన కట్టకు మరమ్మతు పనులు చేయిస్తామని సర్పంచ్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు.



గండి ప్రదేశంలో మొరం పోయిస్తున్న సర్పంచ్

ముప్పవాని చెరువు గండి పూడ్చివేత

భారీ వర్షాలకు మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని ముప్పవాని చెరువుకు పడ్డ గండిని సర్పంచ్ అబ్బు ప్రకాష్‌రెడ్డి ఆదివారం పూడ్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారీ వర్షాలతో గ్రామంలోని ముసలమ్మకుంట, మైదం కుంట, చెరువులు మత్తడి పోయడంతో నీరంతా గుడి చెరువులోకి వెళ్లి చెరువు కట్ట కోతకు గురైందని తెలిపారు. చెరువు గండి ప్రదేశంలో సుమారు 50 ట్రాక్టర్ల మట్టిని పోయించినట్టు చెప్పారు. నీటి పారుదల శాఖ అధికారుల సూచన మేరకు చెరువుల మరమ్మతు పనులు చేయిస్తున్నట్లు వివరించారు. ఆయకట్టు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గండి పూడ్చివేతతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆటోడ్రైవర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



ఆత్మకూరు : తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ (తాడు) ఆధ్వర్యంలో రేపు (మంగళవారం) హనుమకొండలో నిర్వహించనున్న ఆటోడ్రైవర్స్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆటోడ్రైవర్ల సంఘం ఆత్మకూరు పట్టణ కమిటీ అధ్యక్షుడు పొగాకుల రాజు కోరారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పర్వతగిరి రాజు ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్స్ దినోత్సవ కార్యక్రమ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం పొగాకుల రాజు మాట్లాడారు. హనుమకొండ చౌరస్తా నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. మండలంలోని ఆటో డ్రైవర్లందరూ పాల్గొని సత్తా చాటాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బయ్య తిరుపతి, మంద చంద్రమోహన్, సదానందం, వల్లాల నవీన్, పృథ్వీ, కిరీటి, అయోధ్య, సురేష్, కరుణాకర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ సామాజిక బాధ్యత



మొక్కలను నాటుతున్న రైతులు



మొక్కలను పంపిణీ చేస్తున్న సిబ్బంది

● అసోసియేట్ పీయూ మేనేజర్ ఎ.రమేష్

శాయంపేట : ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని మారి స్వచ్ఛంద సేవా సంస్థ అనుబంధ ప్రజ్వల్ రైతు ఉత్పాదకుల సంఘం అసోసియేట్ ప్రాజెక్ట్ యూనిట్ (పీయూ) మేనేజర్ అక్కల రమేష్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని పలు వ్యవసాయ క్షేత్రాల్లోని ఒడ్డు చుట్టూ ఆ సంఘం ఆధ్వర్యంలో మొక్కలను ఆదివారం నాటారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. రైతులు వ్యవసాయ సాగు కోసం అడవుల్లోని చెట్లను నరికేస్తే వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. రైతులు పొలాల గెట్ల వెంట మొక్కలను నాటాలని సూచించారు. ప్రజ్వల్ రైతు ఉత్పాదకుల సంఘం ఆధ్వర్యంలో రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం మండలంలోని శాయంపేట, తహరాపూర్ గ్రామాల్లో పలువురు రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నవయుగ సొసైటీ పాలకవర్గ సభ్యులు గాజె రాజేందర్, జంగిలి రవీందర్, సిబ్బంది రవిచందర్, భానుమతి, రాంబాబు, కల్పన, హిమబిందు, సునీల్, ప్రశాంత్, తిరుపతి, బీసీఐ రైతులు కుసుమ అశోక్, గంగుల రాజిరెడ్డి, బొంత మహేందర్, కోనూరు సతీష్ ఐలి శ్రీధర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై అరాచకాలు దుర్మార్గం



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ఏసుదాసు, తదితరులు

కమలాపూర్ : మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న అరాచకాలు దుర్మార్గమని పాస్టర్స్ అసోసియేషన్ మండల కార్యదర్శి ఎం.ఏసుదాసు అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ కూడలి నుంచి బస్టాండ్ వరకు ఆదివారం శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడారు. మణిపూర్‌లో సుమారు 3 నెలలుగా క్రైస్తవులపై దాడులు, దుర్మార్గాలు జరుగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించి క్రైస్తవులకు రక్షణ కల్పించడంతోపాటు శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థి సంఘాలు, మీడియా సంస్థలు వెలుగులోకి తీసుకొస్తున్నాయని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన.. పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలు, మీడియాపై ఆంక్షలు విధించడం అప్రజాస్వామికమని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్ విమర్శించారు. కేయూ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగాన్ని సర్కారు పూర్తిగా సంక్షోభంలోకి నెట్టి వేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆలువాల నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రవీణ్, అరుణ్, సంగీత, ప్రవీణ్, అభిరామ్, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమమే ధ్యేయం



భిక్షపతిని సన్మానిస్తున్న ప్రభాకర్‌గౌడ్, తదితరులు

ఆత్మకూరు : మాజీ సైనికుల సంక్షేమమే ధ్యేయంగా మాజీ సైనికుల సంఘం ముందుకు సాగుతోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల భిక్షపతి ముదిరాజ్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లిలోని వరద బాధితులకు వైద్యసేవలు అందించేందుకు వెళ్తున్న సందర్భంగా మండల కేంద్రానికి భిక్షపతి ఆదివారం రాగా ఆయన్ను టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు పొగాకుల ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భిక్షపతి మీడియాతో మాట్లాడారు. సమాజంలో ప్రతిఒక్కరు సేవాభావంతో జీవించాలని ఆకాంక్షించారు. మాజీ సైనికులకు ఎలాంటి ఆపద వచ్చినా సంఘం అండగా నిలిచి ఆదుకుంటుదని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, కోశాధికారి వెంకటేశ్వర్లు, చైర్మన్ భూపతిరెడ్డి, వైస్‌చైర్మన్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అభయ' సేవలు మరింత విస్తరించాలి



హరితారెడ్డితో ప్రమాణస్వీకారం చేయించి బాధ్యతలు అప్పగిస్తున్న పరశురాములు, తదితరులు

హన్మకొండ: లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ – అభయ సేవలు మరింతగా విస్తరించాలని లయన్స్ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్, మాజీ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు సూచించారు. హనుమకొండ వడ్డెపల్లిలోని ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ – అభయ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అభయ క్లబ్ అధ్యక్షురాలు మాడుగుల హరితారెడ్డి, కార్యదర్శి వంగ వసంతరెడ్డి, కోశాధికారి బొప్పిడి జగన్ మోహన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులతో లయన్స్ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ పొట్లపల్లి శ్రీనివాస్‌రావు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పరశురాములు మాట్లాడుతూ అవసరార్థులకు లయన్స్ క్లబ్ సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాన్ బన్నీ, డాక్టర్ కొండపల్లి సుధాకర్‌రెడ్డి, వీరారెడ్డి, తాడూరి రేణుక, తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యలు చేపట్టాలి

హసన్‌పర్తి: ముంపు ప్రాంతాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సూచించారు. ముంపునకు గురైన 56వ డివిజన్‌లోని ద్వారకసాయి కాలనీ, జవహర్‌కాలనీ, ఎస్‌వీఎస్ హోం, వెంకటేశ్వరకాలనీ, టీఎన్జీవోస్ కాలనీ-2 ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా బాధితులను పరామర్శించి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులను పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు మణీంధర్‌నాథ్, నరేడ్ల శ్రీధర్, అటికం రవీందర్, కోఆప్షన్ మాజీ సభ్యుడు పాషా, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ చింత రమేష్ తదితరులు ఉన్నారు.

వేడుకగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలోని సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాల ఆవరణలో 1997 –98వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలను జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో విభిన్న వృత్తుల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశాన్ని పాఠశాలలో ఏర్పాటు చేసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోష్, ఉపాధ్యాయులు సయ్యేదా, మమత, అన్వర్ సయ్యద్, సత్యప్రకాష్, రాజన్న, నర్సయ్య, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.